
# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల/నారాయణపేట


## ఓటరు నమోదుకు అధికారులు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**ధరూర్,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో బిఎల్ఓలు సూపర్‌వైజర్లతో ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం6 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఇంకా మండలంలో ఎంత మంది కొత్త ఓటరుగా నమోదు చేసుకున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఫారం6 ద్వారా ఓటరుగా నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉంటే ఫారం 7,8 ద్వారా వాటిని మార్చాలన్నారు. ఎవరైనా ఓటరు మరణిస్తే వారి డెత్ సర్టిఫికెట్ తీసుకొని జాబితా నుండి వారి పేర్లను డిలీట్ చేయాలన్నారు. మండలంలో ఎంతమంది ఓటరు నమోదు అయ్యారో,ఎంత మందిని తొలగించారో పూర్తిస్థాయిలో నివేదిక ఏరోజుకారోజు పంపాలన్నారు.స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకారం సెప్టెంబర్ 2,3 తేదీలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తప్పనిసరిగా 18 సంవత్సరాలుపూర్తి అయిన వారు ఓటరుగా నమోదు కావాలని, ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే చివరి అవకాశంగా ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. డూప్లికేట్ ఓటర్లు ఉంటే తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓటర్లు లేరని సంతకం చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.ఇంటి నంబర్ లేనిచో మార్పించాలని తెలిపారు. ఇప్పటివరకు ఎన్ని ఫామ్స్ వచ్చాయి. ఇంకా ఎన్ని రావలసి ఉంది, వచ్చిన వాటిని ఏ రోజుకారోజు యాప్‌లో చేర్చాలన్నారు. గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు ఓటరు నమోదుపై మార్పులు, చేర్పులుపై టామ్ టామ్ ద్వారా ప్రజలందరికి తెలపాలన్నారు.సమావేశంలో తహసిల్దార్, సి సెక్షన్ నరేష్,బిఎల్ఓలు,సూపర్‌వైజర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

## ఆశాల వేతనాలు పెంచాలని క్యాంప్ కార్యాలయం ముట్టడి...

**అచ్చంపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలో ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేష్ వాపోయారు.ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే ప్రతి పనిని ఆశా వర్కర్లతో నిర్వహించి పనికి తగిన వేతనం ఇవ్వకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని ఆయన అన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు అందించారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు లక్ష్మి, ప్రమోదమ్మ, రజిత, రోజా తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఆశాలు

## టూరిజం పార్కును అందంగా తీర్చిదిద్దాలి..

**ధరూర్,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రేవులపల్లి డ్యాం సమీపంలోని టూరిజం పార్కు 70 ఎకరాలలో తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న టూరిజం పార్కు పనులను మ్యాప్‌ద్వారా పరిశీలించారు. నక్షత్ర పార్కు, ఫుడ్‌కోర్టు, పార్కింగ్, చిల్డ్రన్స్ పార్కు, అవెన్యూ ప్లాంటేషన్, కంపౌండ్ వాల్, సైన్స్‌పార్కు, బెంచీలు,లాన్, ఫ్లోరింగ్, పెయింటింగ్ ఇతర పనులపై జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మ్యాపు ప్రకారం కలెక్టర్‌కు వివరించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజెపి డ్యాం పరిశీలించేందుకు వచ్చే పర్యాటకులకు అనువుగా టూరిజం పార్కు ఏర్పాటు చేయడం, అన్ని ఇతర వసతులు అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు.పార్కులో బెంచీలు అవెన్యూ ప్లాంటేషన్ ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ హనుమంతరావు, నర్సిరెడ్డి కాంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

### మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**అమరచింత,ఆగస్టు 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళుతున్నామని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో యాదవులకు రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడతలో మంజూరైన ఆరు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. అలాగే దివ్యాంగులకు రాష్ట్రప్రభుత్వం రెండవ విడతలో మంజూరైన ఆరుగొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు.అలాగే దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మూడువేల 16నుండి 4వేల 16కు పెంచిన ప్రోసిడింగ్ కాఫీలను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్‌పర్సన్ రజిని సాయి చందు దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని ఏకైక ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని ఆయన అన్నారు. రాష్ట్రంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆడపిల్లల తల్లిదండ్రులకు దేవుడిచ్చిన వరమని, రైతు బీమా, రైతు బంధు, రైతు రుణ మాఫీ, చేసి రైతు బాంధవుడు నిలిచారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ, నాగభూషణం గౌడ్, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్లు, షేక్‌చాంద్ బాషా,ఆత్మకూరు మార్కెట్‌చైర్మన్,ఎస్‌ఏ రాజు,సరోజ,బాల్‌రెడ్డి, మహమ్మద్ కాజా, కౌన్సిలర్లు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రోసిడింగ్ కాఫీలను ఎమ్మెల్యే చిట్టెం

## అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి..

### క్రీడాకారులను సన్మానించి జడ్పీ చైర్‌పర్సన్

**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జరిగిన ఛలో మైదాన్ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె మాట్లాడుతూ జిల్లా నుండి వివిధ క్రీడలలో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడాలని తెలిపారు.ఈ సందర్భంగా అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి అనన్యశ్రీ,నేషనల్ అథ్లెట్ హారిక, నేషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్ శ్రీలతను, రిటైర్డ్ పిఇటి నర్సింలును సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ జ్యోతి పాల్గొన్నారు. డిపిఆర్ఓ రషీద్, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నర్సింలు, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు చెన్నవీరయ్య, పీఈటిలు ఆంజనేయులు, రమణ, అనంతసేన, సాయినాథ్, మౌలాలి, రాజశేఖర్, వేణు, అక్తర్, పారిజాత, రూప, పర్వీన్, రాధిక, అజిత్,రఘు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

## ప్రజలకు చేరువై సేవలందించాలి...

### మహారాష్ట్ర బ్యాంక్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఏర్పాటుచేసిన మహారాష్ట్ర బ్యాంక్‌ను లీడ్ బ్యాంక్ మేనేజర్, బ్యాంక్ అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం బ్యాంక్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహారాష్ట్ర బ్యాంక్ కార్యకలాపాలు మరింతగా విస్తరింపజేసి ప్రజలకు విస్తృత సేవలు అందించాలన్నారు.అలాగే ప్రభుత్వ పథకాల్లో అర్హులైన వారికి రుణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ధేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిశోర్ పాండే, బ్యాంక్ జోనల్ మేనేజర్ శుశాంత్‌కుమార్‌గుప్త, బ్యాంక్ మేనేజర్ ఎన్.రాకేష్, సిబ్బంది పరమేష్, ఆనంద్ తదితరులు ఉన్నారు.



మహారాష్ట్ర బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# 2కోట్ల ఉద్యోగాలు ఎక్కడ..?

- బిజెపి నాయకులకు మంత్రి సూటి ప్రశ్న..
- మెగా జాబ్‌మేళాను యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు పనులు వేగవంతం వేసి ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తాం
- పట్టణ భజరంగ్‌దళ్, గోరక్షా సమితి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లోకి చేరికలు
- అభివృద్ధే మా అభిమతం మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 29 ప్రభాతవార్త :** ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ ఉద్యోగాలను ఎందుకు కల్పించలేకపోతుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. యువతను రెచ్చగొట్టడం, సెంటిమెంట్‌తో వాడుకోవడం తప్ప దేశానికి బిజెపి చేసింది ఏమి లేదని ఈ అంశంపై యువకులు ఆలోచించాలని కోరారు. భూత్పూర్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌కుమార్, గోరక్షక్ పట్టణ అధ్యక్షుడు చందు వరప్రసాద్, నాయకులు వెంకటేష్,రాజశేఖర్, నిచల్, మోహన్, నందు సహా ముగ్గురు 50 మంది మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మహబూబ్‌నగర్‌లో గత తొమ్మిది ఏళ్లలో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు భజరంగ్‌దళ్, గో రక్షక్ నాయకులు పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ బిజెపి నాయకులు సెంటిమెంట్ ద్వారా రెచ్చగొట్టి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని యువకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమైక్య రాష్ట్రంలో నిత్యం మత ఘర్షణలు జరిగి అనేక మంది చెందారని ఆయన అన్నారు. యువతకు మంచి చదువు, ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. వచ్చే నెల 2న జిల్లా కేంద్రంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఏడో తరగతి పాసైన వారి నుంచి పిజి, బిటెక్, ఎంటెక్ చేసిన వారికి కూడా వారి అర్హతల ఆధారంగా లక్ష రూపాయల వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడే ఉద్యోగాలు చేస్తూ యువత బాగుండాలన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధర్మాన్ని ప్రజలను కాపాడుతామని చెప్పారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేయాలని సీఎం కెసిఆర్ ఆదేశించారని, వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు.



పార్టీలో చేరిన బజరంగ్‌దళ్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



పార్టీలో చేరిన హన్వాడ నాయకులతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**కాంగ్రెస్‌ను వదిలి అధికా పార్టీలోకి చేరికలు..**

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు మేకల కనకయ్య, గొల్ల రాములు, ఇప్పల రాములు, మేకల శివప్ప, గుండుమల రాములు, గొల్ల మల్లప్ప, గుండుమల యాదయ్య సహా 100 మంది మంత్రి డా వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.


**పార్టీలో చేరిన యువత..**

మై ఇండియన్ యూత్ అసోసియేషన్, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అరవింద్, గోపాల్, ప్రవీణ్, రవితేజ, నవీన్‌కుమార్ సహా సుమారు 40 మంది మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపిపి బాలరాజు, జడ్పీటిసి విజయనిర్మల రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ కృష్ణయ్యగౌడ్, కొండా బాలయ్య, పార్టీ అధ్యక్షుడు ఖాజాన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత గిరిజనులను మోసం చేసిన కెసిఆర్ ప్రభుత్వం..

- ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ చారిత్రాత్మకం..
- తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట,ఆగస్టు 29 ప్రభాతవార్త :** దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం చేవెళ్ల ప్రజాగర్జన బహిరంగ సభలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే నేతృత్వంలో,టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పల్లమరి నరెందర్‌రెడ్డి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఏఐసిసి అధ్యక్షులు, దళిత ముద్దుబిడ్డ మల్లికార్జున్ ఖర్గే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చారిత్రాత్మకమని ఈ డిక్లరేషన్‌పై దళిత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని, గిరిజనులకు 12 శాతంరిజర్వేషన్లు ఇస్తామని, చెప్పి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి దళిత, గిరిజనులను కెసిఆర్ ప్రభుత్వం మోసం చేసిందని బిఆర్ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో దళిత, గిరిజనులను ఆదుకున్నది, దళిత గిరిజనులకు భూములు ఇచ్చి దళిత, గిరిజనులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్ సొంతమన్నారు. కానీ నేడు దళిత, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన భూములను కెసిఆర్ ప్రభుత్వం లాక్కుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలనలో దగాపడ్డ దళిత, గిరిజన సోదరులకు అండగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ తీసుకువచ్చింది అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అంబేద్కర్ అభయహస్తం కింద ఆర్థికంగా వెనుకబడ్డ దళిత గిరిజన కుటుంబాలకు 12 లక్షలు ఇస్తుందన్నారు. ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతానికి రిజర్వేషన్లు పెంచుతామని తెలిపారు. సొంత ఇల్లు, ఇంటిస్థలం లేని దళిత, గిరిజనులకు ఇంటి జాగా ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 6 లక్షలు ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ పెట్టిన దళిత, గిరిజన డిక్లరేషన్ పట్ల దళిత, గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ హామీలు, దళిత డిక్లరేషన్‌తో కూడిన కరపత్రాలను జీఎంఆర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ మండల అధ్యక్షులు వెంకటేష్, నెల్లికొండి సర్పంచ్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపిపి ధనుంజయ, మాజీ కో ఆప్షన్ జాకీర్, మాజీ సర్పంచ్ మొగిలన్న, నాయకులు శేఖర్, ప్రతాప్, హబీబ్, అమ్రేష్, నాగరాజు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్‌రెడ్డి

## గ్రామాల్లో అనూహ్య మార్పులు..

### 2014కు ముందు ఇప్పటికే పోల్చండి.. ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాకముందు గ్రామాలను ఇప్పటి గ్రామాలతో పోల్చుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడెలా ఉందో చూడాలన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో సరైన విద్యుత్ లేక 200ల పెన్షన్‌తో, తాగడానికి నీరులేక, రైతులు యువత అన్నివర్గాల వారు ఎన్నోఇబ్బందులు ఎదుర్కొన్నారని అలాంటిది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడగకముందే రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం జరిగిందని,200రూపాయల పెన్షన్ రెండువేలకు,500 రూపాయల వికలాంగులకు పెన్షన్ 4 వేలకు పెంచిన ఘనత తమదేనని అన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో సుమారు 10 కోట్ల రూపాయల విలువ కలిగిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. రామచంద్రపురం నుంచి కోటకద్ర మీదుగా 6కోట్ల 90లక్షల రూపాయల వ్యయంతో మాచన్‌పల్లి వరకు నిర్మించిన బిటి రోడ్డును మంత్రి ప్రారంభించారు. కోటి61లక్ష 28వేల రూపాయల వ్యయంతో నిర్మించిన 32 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించారు. అంతేకాక 97 లక్షల 85 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన చేయగా, ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని, ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బీరప్ప దేవాలయాన్ని మంత్రి ప్రారంభించారు. మరో 15 లక్షల రూపాయల వ్యంతో నిర్మించిన నాలుగు సిసి రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకాన్ని ఇవ్వడం జరిగిందని, గతంలో కరెంటు అడిగితు కాల్చి చంపిన దాఖలాలు ఉన్నాయని, వైద్యంకోసం అప్పులుచేసి ఉన్న ఆస్తులను ఖర్చుపెట్టుకున్న పరిస్థితులు ఉండేవని, అలాంటిది రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అడగకముందే రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని,రైతులకు రైతుబంధు కింద పెట్టుబడితో పాటు చనిపోయిన రైతులకు ఐదు లక్షల రూపాయల భీమా చెల్లించడమే కాక, కుటుంబంలో వారికి రూ.2వేల పెన్షన్ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు.పాలమూరు,రంగారెడ్డి ఎత్తిపోతలపథకం కింద జిల్లాలోని అన్ని చెరువులను నింపి సంవత్సరంలో రెండు పంటలు పండించేలా చర్యలు చేపడతామన్నారు. మాచన్‌పల్లి గ్రామంలో తెలంగాణ రాకముందు 200రూపాయల పెన్షన్ కింద2005 మందికి నెలకు 40 వేలు ఇవ్వగా ఇప్పుడు పెన్షన్ల రూపేణా 52 లక్షల 19 వేల రూపాయలు ఇస్తున్నామని, కేవలం పెన్షన్ల కింద గ్రామంలో 6 కోట్ల 35 లక్షల ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. కళ్యాణలక్ష్మి కింద 82మందికి 80లక్షల రూపాయలిచ్చామని,రైతు బంధు కింద6కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టామని, రైతుభీ మా కింద చనిపోయిన 13మంది రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందించామని, ముఖ్యమంత్రి సహాయనిధి కింద 35మందికి 17లక్షల రూపాయలు ఖర్చుచేశామని తెలిపారు. జిల్లా గ్రంథా లయసంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్,ఎంపిపి సుధాశ్రీ,వైస్‌ఎంపిపి అనిత, రైతుబంధు డైరెక్టర్ మల్లు నరసింహారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అల్లావుద్దీన్, దేవేందం రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



సిసి రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## బోనమెత్తిన భూత్పూర్..!!

### 'ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్,ఇతర నేతలు..

**భూత్పూర్,ఆగస్ట్ 29.ప్రభాతవార్త :** ప్రతీయేటా ఆషాడ,శ్రావణమాసాలొచ్చాయంటే చాలు అమ్మవార్లు, గ్రామదేవతల కొలువులు,ప్రత్యేక పూజలు ముఖ్యంగా బోనాల సంబరాలు నిర్వహిస్తారు అమ్మలక్కలు, భక్తులు. ఆషాడమాసంలో రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లో ఆరంభం కాగా రాష్ట్రం నలుమూలల బోనాల పండుగను ఎంతో ఘనంగా జరుపుతారు. ఈ నేపథ్యంలో భూత్పూర్ పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో శ్రాశణ మాసం రెండో మంగళవారం బోనాల ఉత్సవాలు జరుపడం ఇక్కడి ఆనవాయితీ.కాగా భూత్పూర్‌లో బోనాల ఊరేగింపు ఎంతో ఘనంగా, కన్నులపండువగా నిర్వహించారు.పండుగ రోజు ముత్తయిదువలు,ఆడపడుచులు ముఖ్యంగా పెళ్లికాని యువతులు,బాలికలు బోనమెత్తడం సాంప్రదాయం.మంగళవారం సాయంత్రం భూత్పూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్,ముడా డైరెక్టర్ మూస సాయులు,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళిధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,సత్తూర్ అశోక్ గౌడ్,బోరింగ్ నర్సింహులు,గడ్డం యాదయ్య,గడ్డం రాములు,గడ్డం ప్రేమ్, ముదిరాజ్ నాయకులు గొడుగు వెంకట్‌రాజు,పులగుర్ల చంద్రమౌళి,జైదు శ్రీను, తిర్లపురం పెంటయ్య,పులగుర్ల మల్లేస్,తరుణ్,భీంరాజ్,గడ్డం ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.బోనాల ఘటాలతో మహిళలు, యువతులు బాలికలు కిలోమీటర్ మేర బారులు తీరి ఊరేగింపు నిర్వహించారు.బోనాల ఊరేగింపు తిలకించేందుకు భూత్పూర్ పట్టణం తరలివచ్చింది.భూత్పూర్ జాతీయ రహదారి కూడలి నుంచి పట్టణ చివర ఉన్న శ్రీరామలింగేశ్వరాలయం (శివాలయం) పట్టణం జనసంద్రమైందనే చెప్పాలి.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



ఊరేగింపులో పాల్గొన్న స్థానిక మున్సిపల్ చైర్మన్ ఇతర నాయకులు

## ఓటరుగా నమోదు చేసుకోవాలి:కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో స్వీప్ నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల డిగ్రీకళాశాల ఐటిఐ కళాశాలలో 18ఏళ్లపైబడిన విద్యార్థులను ఓటరుగా నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు దాటిన వారిని ఫారం 6 ద్వారా నమోదు చేయాలన్నారు. ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సిటికేబుల్,ఆటోలలో చురుకుగా ప్రచారం నిర్వహించి రెండు మూడు రోజులలో ఓటర్ల నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, సిపిఓ, డిపిఓ, డిపిఆర్ఓ, విద్యాశాఖ అధికారులు, ఎన్నికల సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

## ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి..

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ విద్యార్థినిలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించడం జరిగింది. రాజ్యాంగం పట్ల ఉన్న హక్కులలో ఓటు హక్కు ఒకటని అని తెలిపారు. ఓటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అవ్వకపోయి ఉంటే ఫారమ్ 6 ద్వారా ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్ లో కానీ ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. అదే విధంగా దివ్యాంగులు అయి ఉంటే పిడబ్ల్యుడి ఓటరుగా నమోదు చేసుకోవాలని వారికి పో లింగ్ స్టేషన్‌కి వెళ్లలేని పరిస్థితి ఉంటే ఇంటి దగ్గరే ఓటు వేసే వెసులుబాటు కల్పించడం జరి గిందని తెలిపారు. విద్యార్థినిల తో వారి ఉన్నత భవిష్యత్తుకు సంబంధించి ఉన్నత చదువులు పై వారితో సంభాషించడం జరి గింది. మంచి విద్యతోనే వ్యక్తి సమాజంలో గుర్తింపు పొందుతారని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్



పాల్గొన్న విద్యార్థులు

## కాంగ్రెస్ పార్టీ హామీలు ప్రగతికి సోపానాలు..

**టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి**



**దేవరకద్ర,ఆగస్టు 29 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ హామీలు ప్రగతికి సోపానాలని దేవరకద్రకు చెందిన టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆయన దేవరకద్రలో మంగళవారం మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను ఆయన వివరించారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ ఇస్తుందన్నారు.అలాగే నిరుద్యోగులకు నెలకు రూ.4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తుందన్నారు.ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5లక్షల వరకు ఉచిత చికిత్స అందిస్తుందన్నారు.వెనుకబడిన వర్గాల విద్యార్థులందరికి ఫీజు రియంబర్స్‌మెంట్,ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదికే రూ.2లక్షల ఉద్యోగాలు,అమరుల తల్లితండ్రులకు రూ.25వేల పెన్షన్,వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం,భూమిలేని నిరుపేదలకు ప్రతిఏడాది రూ.12వేలు,అంబేద్కర్ అభయ హస్తం ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు ఆర్థికసహాయం,ఇళ్ళులేని ప్రతి ఎస్సీ,ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలం ఇంటి నిర్మానానికి రూ.6లక్షలు,రూ.500లకే గ్యాస్ సిలిండర్,చేయూత కింద ప్రతి నెల రూ.4వేల పెన్షన్,18 ఏళ్ళు పై బడిన విధ్యార్థినిలకు ఎలక్ట్రిక్ స్కూటర్,మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం,ఇందిరమ్మ ఇంటికి రూ.5లక్షల సాయం,రైతులకు,కౌలురైతులకు రూ.15వేలు పెట్టుబడి సాయం,ఎస్సీల రిజర్వేషన్లు 18శాతానికి పెంచడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు గట్టి చర్యలను కాంగ్రెస్ పార్టీ తీసుకొంటుందని కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

## కోయిల్‌సాగర్‌లో నిలకడగా నీటిమట్టం..

**-ఆయకట్టుకు కొనసాగుతున్న నీటిసరఫరా -ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న కృష్ణజలాలు**

**దేవరకద్ర,ఆగస్టు 29 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. తీలేర్ పంప్‌హౌజ్ ద్వారా కృష్ణ జలాలను కోయిల్‌సాగర్‌కు గత కొన్నిరోజులుగా తరలిస్తున్నారు.దీంతో కోయిల్‌సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది.దీంతో మంగళవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 27.6 ఫీట్లకు చేరి నిలకడగా ఉంది. ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతుండటం,ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో నీటిమట్టం పెరుగకుండా నిలకడగా ఉంది.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 4.9 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.కోయిల్‌సాగర్ ప్రాజెక్టునుండి గత కొన్ని రోజులుగా ఆయకట్టుకు నీటిపరఫరా కొనసాగుతునే ఉంది.ప్రాజెక్టు కుడి,ఎడమకాలువల ద్వారా ఆయకట్టుకు ఈ నీటిని నీటిసరఫరా చేస్తున్నారు.


## అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సహాయం..



**గండీడ్, ఆగస్టు 29 ప్రభాతవార్త :** మహబూబ్‌గనర్ జిల్లా మహ్మదాబాద్ మండల పరిధిలోని తుర్కషేక్‌పల్లి గ్రామానికి చెందిన బెస్త దేవమ్మ మృతి చెందడంతో విషయం తెలుసుకున్న కాసాని వీరేష్ ముదిరాజ్, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి మృతురాలు దేవమ్మ భర్త బెస్త మొగులయ్య కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని కొమిరె లక్ష్మయ్య ముదిరాజ్,మాజీ ఎంపిపి ఆధ్వర్యంలో కాసాని వీరేష్ టీం సభ్యుడు కొత్త గోపాల్ ముదిరాజ్, ఉమ్మడి మండలాల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు జెట్టి నర్సిములు ముదిరాజ్, తెలుగుదేశం పార్టీ మహ్మదాబాద్ మండల అధ్యక్షుల ద్వారా అందజేయడం జరిగింది. కార్యక్రమంలో షేక్‌పల్లి ఎంపిటిసి బెస్త వెంకట్‌రాములు, గ్రామ్తులు, బెస్త లాలయ్య, బెస్త వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం**



**అమరచింత,ఆగస్టు 29 ప్రభాతవార్త :** అమరచింత మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే, చిట్టెం రామ్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాఘవ మాట్లాడుతూ అమరచింత మండలంలో ఏడు ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 600 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారని పదవ తరగతి ఉత్తీర్ణులైన తరువాత ఇంటర్, డిగ్రీ చదువుల కోసం మహబూబ్‌నగర్, వనపర్తి, ఆత్మకూర్ సుదూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లలేక మధ్యలోనే చదువులు మానేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కళాశాలలు ఏర్పాటు చేయకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అవినాష్, వినయ్, రమేశ్, రాఘవేంద్ర, తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో అగ్రవర్ణాలదే అధికారం..

**ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య మహారాజ్**



**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోను అగ్రవర్ణాలే అధికారం చలాయిస్తున్నాయని ధర్మ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య మహారాజ్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో రెండవ ఏఎన్ఎంల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. సబ్బండ వర్గాలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో పాలనలో వారికి ప్రాధన్యం లేకుండా చేశారని విమర్శించారు. ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నది కూడా అగ్రవర్ణాల వారేనని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఆశాలు తదితర చిన్న, చితక ఉద్యోగాలు చేస్తున్నది బడుగుబలహీన వర్గాల వారే నన్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని 14 రోజులుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. న్యాయమైన పోరాటాలను అణచివేస్తు ధోరణి ప్రభుత్వం విడనాడాలని డిమాండు చేశారు. డిమాండు నెరవేరే దాకా పోరాటం కొనసాగించాలని ఏఎన్ఎంలను కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే.శ్రీరామ్, ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కష్ణవేణి, లక్ష్మమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేశ్, ధర్మ, సమాజ పార్టీ జిల్లఆ నాయకులు పాల్గొన్నారు.

## వచ్చేనెల 6న అయిజలో దివ్యాంగుల భరోసా సభ..



**ఇటిక్యాల,ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ సెప్టెంబర్ 6వ తేదీన పట్టణంలో పాత ఠాగూర్ పాఠశాల గ్రౌండ్‌లో దివ్యాంగుల భరోసా సభ నిర్వహిస్తున్నట్లు ఈ సభకు జిల్లాలోని దివ్యాంగులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ పార్టీ జిల్లా ఇంఛార్జి ఎంజి కృష్ణ, అలంపూర్ తాలూకా అధ్యక్షులు తిరుపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో వచ్చేనెల 6వతేదీన అయిజ పట్టణంలో నిర్వహించే దివ్యాంగుల భరోసా సభకు సంబంధించిన గోడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు సదుపాయాలు కల్పించడం లేదని సభద్వారా ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు దివ్యాంగుల భరోసా సభ ఏర్పాటు చేసినట్లు ఈ సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు యువరాజు, నాయకులు ఉపెందర్, రవి, మధు, బీసన్న, విజయ్, వెంకటేష్, నవీన్, రాముడు, బి.సన్నా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృభాష.. జాతీయ క్రీడా దినోత్సవం..



**ఇటిక్యాల,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాలలో మంగళవారం మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. గేయాలు, నృత్యాలు, క్విజ్ కాంపిటిషన్ పోటీలు నిర్వహించి అబ్బురపరిచారు. మాతృభాష గొప్పతనాన్ని గురించి పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. అదేవిధంగా జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా హాకీ దిగ్గజ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ హాకీ దిగ్గజ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడల్లో సాధించిన విజయాలపై భారత్‌కు తెచ్చిన విజయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నందిని, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** క్రీడల్లో యువత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మేజర్ ధ్యాన్ చంద్ 118వ జయంతిని పురస్కరించుకొని జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను స్థానిక బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం చాలా ముఖ్యమని తెలియజేశారు.ఏవిద్యార్థి అయిన 100శాతం మార్కులు సంపాదించినంత మాత్రాన జీవితంలో విజయం సాధిస్తారని అనుకోలేమన్నారు. అదే ఒక సబ్జెక్టుపై నిష్ణాతుడైన వారు అందులో విజయం సాధిస్తాడని అనుకోవచ్చు కానీ యాటిట్యూట్ ఉన్న వారు ఒక సారి ఓటమి చెందిన దానిని సవాలుగా తీసుకొని తిరిగి పోరాటం చేసే క్రీడాకారుడని, వారు జీవితంలో ఖచ్చితంగా విజయం సాధిస్తారన్నారు. అనంతరం క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. నాగర్‌కర్నూల్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడలతో పాటు ఓటు ప్రాధాన్యత, ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

18 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునే విధంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి రాంమోహన్‌రావు, జిల్లా యువజన క్రీడాకారుల శాఖ అధికారి సీతారాం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, పీఈటీలు విద్యార్థులు తదితరులు ఉన్నారు.




క్రీడాకారులనుద్ధేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

## మానవ మనుగడ నిత్యం చట్టాలతో ముడిపడి ఉన్నది...




సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జీ సబిత

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** విద్యార్థి, విద్యార్థినులు తమ లక్ష్యాలను చేధించేటలో చట్టాలపై అవగాహన కలిగి ఉంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జీ సబిత అన్నారు. మంగళవారం తెల్కపల్లి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జి సబిత కళాశాల ప్రాంగణం నుంచి సమావేశ మదిరం వరకు మర్యాద పూర్వకంగా విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ చట్టం ప్రతి ఒక్కరి హక్కు, మానువ మనుగడలో ప్రతి నిత్యం చట్టాలతో ముడిపడి ఉన్నది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అరాచకాల నుంచి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలే మనకు రక్షణ కల్పించి కాపాడుతున్నవన్నారు. 14-18 సంవత్సరాల మధ్య విద్యార్థి దశలోని పిల్లలు మాకు అన్ని తెలుసుననే భావనలో ఉంటారు కానీ నిజాన్ని గ్రహించలేరు, సినిమాల్లో చూపించే సన్నివేశాలకు ఆకర్షితులవుతున్నారని, సినిమా జీవితం వేరు... నిజ జీవితం వేరు కాబట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన నిజాన్ని గ్రహించాలి, చదువుతో పాటు మంచి ప్రవర్తన కలిగి జీవిత లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్యార్థులందరు చట్టాలపై అవగాహన కలిగి వాటిని రక్షించుటకు తమ బాధ్యతలు, విధుల గురించి తెలుసుకొని ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో 1వ జూనియర్ సివిల్ జడ్జీ ఎ.ప్రవీణ్‌కుమార్, 2వ జూనియర్ సివిల్ జడ్జీ మౌనిక, పీపీ భవాని, న్యాయవాదులు మధుసూదనరావు, శ్యాంప్రసాద్‌రావు, రామచంద్రయ్య, ఆర్య, శ్రీరామ్, ఎస్.ఆర్.సత్యనారాయణ, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సాయిలత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

## కారుణ్య నియామకం కింద 11 మందికి ప్రొసీడింగ్‌లు అందజేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** జిల్లాలో కారుణ్య నియామకం క్రింద 11 మందిని నియమిస్తున్నట్లు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి ఉన్నతంగా రాణించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అభినందిస్తూ ఉద్యోగ నియామకాల పత్రాలను అందజేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో వివిధ కారణాల వల్ల తల్లిదండ్రుల ఉద్యోగాలు పిల్లలకు రావడం జరిగింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని పదకొండు మందికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కారుణ్య నియామకం కింద 11 మందికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 11మంది వివరాలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారి ఉద్యోగ అనుభవం టైపింగ్, కంప్యూటర్ వర్క్, రాయడం,చదవడం వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధినిర్వహణలో ఏ పని అప్పగించిన బాధ్యతయుతంగా పనిచేసి ఉన్నతాధికారుల గుర్తింపు పొందాలని కలెక్టర్ ఆదేశించారు.ఉద్యోగాల పొందిన వారిలో మేహరునిసా (ఉద్యానవనశాఖ), రామాంజనేయులు (జిల్లా కోశాధికారి) మొహజీజ్ ఖాన్ (ట్రాన్స్ పోర్టు) రోహిత్ నిహాల్ (డిపిఆర్ఓ), మహర్షి (10వ బెటాలియన్),ప్రేమ్‌కుమార్ (సబ్‌రిజిస్ట్రార్),క్రాంతికుమార్(సిపిఓ),మాధవిలత(డిసిఎస్ఓ),ఖదీర్‌పాషా(ఇరిగేషన్) రమేష్‌బాబు (ఎస్‌సిడిడి)ఉమామహేశ్వర్‌గౌడ్ (పోలీస్) ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, ఏఓ వీరభద్రత తదితరులు ఉన్నారు.

## డబ్బులు, పదవులు ఆశపెట్టి కాంగ్రెస్ పార్టీలోకి పిలుచుకుంటున్నారు..



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** గద్వాల పట్టణంలోని డికె బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ గడ్డం క్రిష్ణరెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో బలమైన పార్టీ అని బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇంఛార్జిలు బలమైన కార్యకర్తలు ఉన్నారని ఖచ్చితంగా రాష్ట్రంలో, గద్వాల నియోజకవర్గంలో డికెఅరుణ గెలుపుతో బిజెపి జెండా ఎగురవేస్తామని అన్నారు. గద్వాల ప్రాంతం అభివృద్ధి చెందిందంటే డికె అరుణ కృషి అన్నారు. గ్రామస్థాయిలో సేవ చేసినటువంటి డికె అరుణను గ్రామాల్లో పెద్ద ఎత్తున స్వాగతిస్తూ నెట్టెంపాడు ప్రాజెక్టు వల్ల రెండు లక్షల ఎకరాలకు నీరందించి రైతులు సస్యశ్యామలంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే దానికి కారణం డికె అరుణ అన్నారు. గ్రామస్థాయిలో లేనటువంటి పార్టీ అధికారంలోకి రానటువంటి కాంగ్రెస్ పార్టీ భారతదేశంలో ప్రతిష్టమైన నరేంద్రమోడీ నాయకత్వంలో గద్వాల ప్రాంతంలో అరుణ నాయకత్వంలో బలంగా ముందుకు పోతున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాల్వాయి రాముడు, బిజెపి నాయకులు అరుణ్, పేపర్ నరసింహ, వంశీ తదితరులు ఉన్నారు.

## రూ.20లక్షల చెక్కును అందజేసిన ఎపిజివిబి బ్యాంక్ మేనేజర్



నామినికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

**కెటిదొడ్డి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గంగన్‌పల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచ్ వారు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ధరూర్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో గంగన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యాంకులో జరిగే వివిధ రకాల సౌకర్యాల గురించి వివరించారు. సామాజిక భద్రత పథకాలు అయిన ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్స్‌ల గురించి వివరించారు. ఇన్సూరెన్స్‌కి సంబంధించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ అర్హులు తప్పకుండా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకుని సామాజిక భద్రత పథకాలను ఉపయోగించుకోవాలని ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. గతంలో గంగన్నపల్లె గ్రామానికి చెందిన చిన్న నర్సింహులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ 1000 చేసుకోవడం జరిగిందని ఆయన వాహనం యాక్సిడెంట్ ప్రమాదంలో చిన్న నర్సింహులు చనిపోయారు. ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల ఆయన కుటుంబానికి బ్యాంక్ ద్వారా నామిని భార్యకు రూ. 24 లక్షల చెక్కును బ్రాంచ్ మేనేజర్ అందజేశారు.కార్యక్రమంలో ధరూర్ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ రంజిత్, నోడల్ ఆఫీసర్స్ సి.వి. రమేష్, బి. సురేష్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ విశాల్, ఫీల్డ్ ఆఫీసర్ కిశోర్, హుస్సేన్, క్యాషియర్ హనుమంతునాయుడు, బ్యాంక్ మిత్ర జమీల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు, నర్సింహులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపించాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**ధరూర్,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపిపిఎస్, జడ్పీ హైస్కూల్ రేవులపల్లి ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించి మన ఊరు మనబడి కింద నిర్మించిన నిర్మాణాలను పరిశీలించారు. కంపౌండ్‌వాల్, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్ తదితర పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యార్థులతో మమేకమై పదవ తరగతి విద్యార్థినిలతో ఇంగ్లీష్ పాఠం చదివించారు. సిలబస్ ప్రకారంగా బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జడ్పీ హైస్కూల్లో జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా ప్ర వ ఌ ఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించి ఎంత మంది హాజరయ్యారని ఉపాధ్యాయులు,విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం క్రీడలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తుందని, చదువుతో పాటు క్రీడలలో పాల్గొనేలా చూడాలని, చిన్నతనం నుండే క్రీడలవైపు ప్రోత్సహించి నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని, ప్రతి విద్యార్థి క్రీడలలో రాణించి మంచిపేరు సంపాదించుకోవాలని అన్నారు. అనంతరం రేవులపల్లి జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, డీఈ రాజేష్, హెచ్ఎం జ్యోత్స్న, హైస్కూల్ హెచ్ఎం ప్రతాపరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం..



**ఊర్కొండ, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన ఎం డీ. షాబుద్దిన్ మంగళవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గిరినాయక్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నిచ్చారు.మృతుడి కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. కార్య క్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలునాయక్, అరుణ్‌కుమార్, వెంకట స్వామిగౌడ్, రవినాయక్,హుస్సేన్,శంకర్‌బాబు, ప్రశాంత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## భూమి దస్త్రాలు తారుమారు చేసి ప్లాట్లు వేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు..

**పెబ్బేరు, ఆగస్టు 29, ప్రభాతవార్త:** మంగళవారం పెబ్బేరు పట్టణానికి చెందిన రైతు ఎం.నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు ఆయనకి చెందిన మున్సిపాలిటీ పరిధిలోని భూమి సర్వే నెంబర్ 455, 456 గల వస్త్రాలను తారుమారు చేసి ప్లాట్లు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డఇ తెలిపారు. పట్టణానికి చెందిన గోనెల నరేష్ కుమార్ తండ్రి. గోనెల ఎల్లయ్య, సిఆర్ నెం.137/2023 ఆధారంగా క్రిమినల్ కేసులు యు/ఎస్ 420 468 ,471 ఆర్/డబ్లు 34 ఐపిసి నమోదు చేశారు. అదే విధంగా అక్రమంగా ప్లాట్లను కొనుగోలు చేసి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులపై కూడా నమోదు అయినట్లు రైతు నరసింహారెడ్డి తెలిపారు.

## పింఛన్లను పంపిణీ చేసిన సర్పంచ్..




**కోయిల్‌కొండ,ఆగస్టు 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల సంక్షేమం కో సం ప్రవేశపెట్టిన పింఛన్లను మండలంలోని కేశవాపూర్ గ్రామ సర్పంచ్ బత్తుల మొగులయ్య మంగళవారం గ్రామంలోని 25మంది వికలాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల నాలుగువేల 16 రూపాయలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఎంపిక



**పెబ్బేరు,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మంగళవారం సెప్టెంబర్ 9.10 వ తేదీలలో కేరళలోని త్రివేండ్రంలో సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు వనపర్తి జిల్లా నుండి పెబ్బేరులోని మాస్టర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు ట్వింకిల్ రెడ్డి చందన నాగ జయశ్రీ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల డైరెక్టర్ ఈ.రంగారెడ్డి సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బృందం మరియు కరాటే మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి మన్నె పరామర్శ..



**నవాబ్‌పేట,ఆగస్టు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి మాతృమూర్తి యశోదమ్మ (94) అనారోగ్యంతో మరణించారు. కిషన్ గూడ మదిర గుబ్బడి గుచ్చాతండా, బిఆర్ఎస్ కార్యకర్త లక్ష్మణ్ నాయక్ తండ్రి పచ్చనాయక్ (70) గుండెపోటుతో తెల్లవారుజామున మరణించారు. విషయం తెలిసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఇరు కుటుంబాలను పరామర్శించారు.

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన ఆశా వర్కర్లు



**ఉండవెల్లి,ఆగస్టు 29 ప్రభాతవార్త :** అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో ఉన్న వివిధ మండలాల గ్రామాల్లోని 642 మంది ఆశా వర్కర్లు అలంపూర్ ఎమ్మెల్యే డా.వి.ఎం అబ్రహాంని మర్యాద పూర్వకంగా కలిసి వారికి జీతం నెలకు రూ. 18వేలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ వర్కర్లను తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నారని, మీ సమస్యలను ఖచ్చితంగా ఆరోగ్యమంత్రి హరీష్‌రావు దృష్టికి సీఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు యూనియన్ నాయకురాలు చెన్నమ్మ, రేణుక, యశోదమ్మ, మమత పాల్గొన్నారు.

# గడప గడపకు కాంగ్రెస్

### కాంగ్రెస్ గెలుపే కార్యకర్తల లక్ష్యం: కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పథకాల గురించి వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**వీపనగండ్ల,ఆగస్టు 29 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని గోవర్ధనగిరి గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే పథకాలు గురించి ప్రజలకు వివరించారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వచ్చి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని 500 రూపాయలు గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఇల్లు కట్టుకోవడానికి ఎస్సీ,ఎస్టీలకు ఐదులక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఎస్సీ ఎస్టీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, అంబేద్కర్ అభయ హస్తం పథకంలో భాగంగా 12 లక్షల రూపాయలు అందిస్తామని అదే విధంగా పదో తరగతి,జూనియర్ కళాశాల విద్యలో పాసైన విద్యా ర్థులకు ప్రోత్సాహకంగా రూపాయలు ఐదువేలు, 10000 ఇస్తుందని మరియు విదేశాలలో చదువుకోవాలన్న విద్యార్థులకు ఆర్థికంగా ప్రోత్సా హిస్తామని తెలియ జేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వీపనగండ్ల మండల అధ్యక్షుడు జి.బీరయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎత్తం క్రిష్ణయ్య, ఇంద్రకంటి వెంకటేశ్,లక్ష్మీదేవమ్మ, వెంకట్‌స్వామి, నారాయ ణరెడ్డి, బాల్‌రెడ్డి,రఘునాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విష్ణు, ఎల్లయ్య వెంకటేశ్, రాముడు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి బోనాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి భార్య జమున

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 29, ప్రభాతవార్త:** అమ్మ కరుణరూపిణి నీ చల్లని చూపులతో కరుణించే తల్లివై మా కష్టాలను కడతేర్చి, మమ్ము గెలిపించే ఈదమ్మ, పోచమ్మ అమ్మవార్లుగా అవతారమెత్తి అమ్మ అందుకో మా నైవేద్యాలు అంటూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి భార్య మర్రి జమున బోనం ఎత్తుకొని అమ్మవార్లకు సమర్పించారు.ఈ ప్రాంత ప్రజల, భక్తుల కొంగు బంగారమై ఊరంతా కాపాడే తల్లివై పిల్ల పాపలను సల్లంగా సూస్తూ మా ఇంటిల్లిపాది ఆరాధ్య దైవంగా నిలిచిన అమ్మ శతకోటిదండాలంటూ కొబ్బరికాయలు కొడుతూ ఆనందహేళిలో సంబురాలు నిర్వహించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆలయంచుట్టు బోనాలనుతిప్పుతూ అమ్మవారికి బోనాలను సమర్పించారు.అమ్మవారిని నిష్ట నియమలతో,భక్తి శ్రద్ధలతో కొలిస్తే కోరిన కోర్కెలు తీరుస్తుందని ఈప్రాంత ప్రజల ప్రగాఢనమ్మకమని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు29, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి బొప్పెల్లి గ్రామంలో నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని వక్రీకరిస్తూ మాట్లాడిన తీరును గ్రామస్తులు తిప్పికొట్టడంతో సహనం కోల్పోయి చంపేస్తా..నరికేస్తా... నా క్యాదరికి ఎబితే కాంగ్రెస్ వాళ్లు ఎక్కడ కనిపించిన ఖతం చేయిస్తానని భూత పద జాలంతో మాట్లాడిన మాటలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిక్కుడు వంశీకృష్ణ,కాంగ్రెస్ పార్టీనాయకులు కుచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నాగం శశిధర్ రెడ్డిల ఆధ్వర్యంలో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్లకు వినతి పత్రం ఇచ్చి ఫిర్యాదు అందించారు. ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే తీసుకొని కాంగ్రెస్ పార్టీకి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన గోళి శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



**వెల్దండ, ఆగస్టు29 ప్రభాతవార్త:** వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన గోళి శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గోళి మధుసూదన్‌రెడ్డిలు గోళి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు పార్టీకి ఎంతో విధేయుతగా ఉంటూ ప్రతి కార్యకర్తకు, ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉన్నారని, వారికి పదవి రావడం ఎంతో అభినందనీయమన్నారు. సన్మానించిన వారిలో పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ గోరటి శ్రీనివాస్, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నూకం వెంకటయ్య, నాయకులు చెర్క రాజశేఖర్, బాలస్వామిగౌడ్, గణేష్, తదితరులు ఉన్నారు.

## జన్మదిన వేడుకల్లో బిఆర్‌ఎస్ నాయకులు

**భూత్పూర్,ఆగస్టు29 ప్రభాతవార్త:** పట్టణంలోని నాలుగో వార్డు ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగిన ఆటో డ్రైవర్ గడ్డం నాగరాజు కుమారుడి జన్మదిన వేడుకల్లో బిఆర్‌ఎస్ నాయకులు టి. మురళీదర్‌గౌడ్, గడ్డం యాదయ్య, గడ్డంరాములు, గడ్డం ఎల్లప్ప, గడ్డం ప్రేమ్,గడ్డం శ్రీనివాసులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టిఎం గౌడ్

# దళితులందరికి దళితబంధు అందించాలి

### ◆దళితులకు మూడు ఎకరాల భూమిని కేటాయించాలి : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవని సతీష్ మాదిగ



కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవని సతీష్ మాదిగ

**అచ్చంపేట, ఆగస్టు29 ప్రభాతవార్త:** గత ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమిని అందించి దళిత అభ్యున్నతికి పోరాడుతానని ఇచ్చిన హామీ నేటికి కూడా నేరవేర్చకపోవడమేమిటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవని సతీష్ మాదిగ ప్రశ్నించారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలో దళితవాడలో పర్యటించి దళిత వాడల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడుతానని ఆయన పేర్కొన్నారు. భూమి లేని దళిత బిడ్డలకు 3 ఎకరాల భూమిని అందించి వారికి ఇచ్చిన హామీని నేరవేర్చుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అంబేద్కర్ చౌరస్తాలో దళితులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని నిరసన వ్యక్తం చేశారు. అచ్చంపేట దళిత నియోజకవర్గంలో ఎంత మంది దళితులకు దళితబంధును అందించారని, దళితులందరికి ఒకే దఫాలో దళితబంధుపథకాన్ని అమలు చేయాలనిఆయన డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు నియోజకవర్గంలో ఎంత మందికి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు.ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజల అభివృద్ధి దిగజారుస్తూ పూటకో మాట మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం పట్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ ప్రజల వద్దకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగినేని రవీందర్, చందులాల్ చౌహాన్, మల్లేష్ మాదిగ,పత్యానాయక్,అంజి, శివ, ప్రభాకర్, అనిల్ తదితరులు ఉన్నారు.

# ప్రజలకు శుద్ధమైన జలాలు అందించడమే లక్ష్యం



మంచినీటిశుద్ధి కేంద్రానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తిరూరల్,ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రజలకు శుద్ధమైన జలాలు అందించడమే ఏకైక లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తర్నికల్ గ్రామం శ్రీరామ్‌నగర్‌లో మంచినీటిశుద్ధి కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ్‌నగర్ గ్రామ స్తుల కోరిక మేరకు మంచినీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు, అందులో భాగంగా శ్రీరామ్‌నగర్ గ్రామానికి మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో మైసమ్మ, పోచమ్మ బోనాల పండుగను పురస్కరించుకొని పండుగ కార్యక్రమంలో పాల్గొని ఆలయాలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో తర్నికల్ ఎంపీటీసీ పవణ్ కుమార్‌రెడ్డి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల్‌సాయిలు,గ్రామస్తులు అర్జునయ్య,భాస్కర్, శ్రీశైలం,బుచ్చయ్య,తిరుపతయ్య,రేణయ్య, యూసుఫ్, రంజిత్‌రెడ్డి, ప్రశాంత్, జగ్గయ్య, సత్తయ్య, జంగయ్య ఉన్నారు.

# ఆశాలకు రూ.18వేల వేతనాలు పెంచాలి



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించిన ఆశా వర్కర్లు

**కల్వకుర్తి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేల వేతనాన్ని అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఆశా కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు వాపోయారు. ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే ప్రతి పనిని ఆశా వర్కర్లతో నిర్వహించి పనికి తగిన వేతనం ఇవ్వకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని ఆయన అన్నారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, వైస్‌ఎంపీపీ కొండూర్ గోవర్ధన్లకు అందించారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కుర్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సి.బాల్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు ఎపీ మల్లయ్య, ఆశా వర్కర్లుఆయా మండలాల అధ్యక్షులు రఫికసుల్తానా, ప్రభావతి, విద్యావతి, జయమ్మ, అనురాధ తదితరులు ఉన్నారు.

# విపత్కర పరిస్థితులో రైతులను ఆదుకోవాలి

### ● కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



**వీపనగండ్ల, ఆగస్టు29 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతు గోస కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విపత్కర పరిస్థితిలో రైతులను ఆదుకోవాలని అన్నారు. అదే విధంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దళితులకు ఇచ్చిన భూములను వేలం వేస్తున్నారని, అకాల వర్షంతో రైతులు పంట నష్టపోయారని ధరణి తీసుకువచ్చి కేసిఆర్ రైతులను మోసం చేస్తున్నారని ధరణి వల్ల రైతులకు వారికి తెలియకుండానే భూములు వేరే పేరు మీద రిజిస్ట్రేషన్ అవుతున్నాయని దీని వలన రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున రుణమాఫీలో మార్పులు చేయాలని వారు అన్నారు.కొన్ని చెక్ డ్యాములు వలన పంటలు కొతకు గురవుతున్నాయని, అదే విధంగా రైతులకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు పైనఉన్న వారికి రుణమాఫీ చేస్తా అని ఇప్పటిదాకా చేయలేదని రైతులకు వడ్డీ పెరగడంతో ఆందోళన చెందుతున్నారని తెలంగాణ ప్రభుత్వం వెంటనే లక్ష రూపాయలు పైన రుణమాఫీ వెంటనే చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆలన్న యువ ఉద్యోగ యాప్ కరపత్రాల పంపిణీ



ఆలన్న యువ ఉద్యోగ యాప్ కరపత్రాలు అందజేసిన దృశ్యం

**అడ్డాకుల,ఆగస్టు29 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండల కేంద్రంలో యువతీ, యువకులు 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలలోపు ఉన్నవారికి పోటీ పరీక్షలకు గాను పదవతరగతి, ఇంటర్, డిగ్రీ డిప్లమో ఐటిఐ పిజి వరకు అర్హత కలిగి ఉన్న విద్యార్థులు పోటీపరీక్షలకు సంసిద్ధం అవ్వాలనుకున్న వారికి ఉప యోగపడే విధంగా ఆలన్న యువ ఉద్యోగ యాప్ గురించి అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. ఈ ఉద్యోగ యాప్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి యువతీ,యువకులకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు డబ్బులు వెచ్చించి వెళ్లి ఖర్చు అవసరం లేకుండా కోర్సుకొరకు ఇంగ్లీష్ తెలుగులో మాధ్యమాలతో జాతీయ స్థాయిలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తయారు చేయబడిన ఈ యాప్ రెండు భాషలలో దాదాపు 1500ల విడియోలు ఉన్నాయి. పూర్తి ఉచితంగా ఈసువర్ణ అవకాశాన్ని దేవరకద్ర నియోజకవర్గయువత సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు మద్దూరి చంద్రమోహన్‌రెడ్డి,మండల యువజన సంఘం అధ్యక్షులు ఎలు సరి బాలరాజు, అడ్డాకుల టౌన్ యూత్ అధ్యక్షులు మహేష్ యాదవ్, గ్రామ రైతు కోఆర్డినేటర్ బొడ్డురమేష్,నాయకులుటి.వెంకటేష్, కిన్నెర దానియేలు, రాజునాయక్,శ్రీనుయాకుబ్,రమేష్,యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న అసైన్మెంట్ భూమి

### మాకు న్యాయం చేయండి : బాధితురాలు దయ్యపు బిచ్చమ్మ





**వీపనగండ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రానికి సమీపాన 634 భూమి సర్వే సంఖ్యలోని ఐదు ఎకరాల భూమిని తనకు ప్రభుత్వం కేటాయించిందని గ్రామానికి చెందిన దళిత మహిళ దయ్యపు బిచ్చమ్మ తెలియజేశారు. ఆమె వివరాలు తెలియజేస్తు ఐదు ఎకరాల భూమిలో కొంత భూమి జూరాల కాల్వ కోసం ప్రభుత్వం తీసుకున్నదని తెలిపారు. మిగతా భూమిని మరియు జూరాల కాల్వకు బాట కోసం వదిలేసిన భూమిని కూడా అక్రమంగా కబ్జా చేశారని, మరియు జూరాల కాల్వ పని చేసేటప్పుడు గుట్టలుగా పోసిన మట్టిని మొత్తం చదును చేసి భూమిని కబ్జా చేశారని అదే భూమిలో కబ్జా చేసిన వారు అక్రమంగా బోరు కూడా వేశారని ఈ స్థల వివాదం కోర్టులో ఉండగానే దౌర్జన్యంగా వారు ఇవన్నీ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా బిచ్చమ్మ కబ్జా చేసి చుట్టుపక్కల పొలాల వారికి దారి లేకుండా చేశారని వాపోయారు. భూ కబ్జాదారు పైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలనివారు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని వారు అన్నారు.

## ఘనంగా బోనాల పండుగ



**వీపనగండ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో ముక్కార్తి మాసంలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాల సమర్పించారు.ప్రతి సంవత్సరం ఇదేకార్తిలో వివిధ రకాల నైవిద్యాలతో పోచమ్మ తల్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మా కుటుంబాలను, చిన్న పిల్లలను కాపాడాలనిపోచమ్మ తల్లి ఆశీర్వచనాలు ఉండాలని మొక్కుబడులు సమర్పించారు.



**పెబ్బేర్లు, ఆగస్టు29 ప్రభాతవార్త:** మంగళ వారం మున్సిపాలిటీ కేంద్రంలో బోనాల పండుగ ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం పోచమ్మ అమ్మవారికి మహిళలు చిన్నారులు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. సార్ మీరు అంటరు కదా మీరు బిజీ ఉన్నారు కదా బోనం కొండను అందంగా బోట్లతో తీర్చిదిద్దిమామిడాకులు యాపాకులతో అందంగాతీర్చిదిద్దుకుని అమ్మవారికి బోనాలతో మేళతాళాలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కోళ్లను హారంగా ఇచ్చి మొక్కులు తీసుకున్నారు.

## ధరణి ఆపరేటర్‌పై వేటు

**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త:** ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్న కొందరు అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందించారు. ఇటీవల వాట్సాప్‌లో తనకందిన సమాచారం ప్రజావాణిలో అందించిన వివరాల ప్రకారం తనదైన శైలిలో సమాచారాన్ని తెప్పించుకుని కఠిన చర్యలకు ఉపక్రమించారు. మొదటగా ఆత్మకూరు ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న భక్తరాజుపై వేటు వేశారు. ఆస్థానంలో రెగ్యులర్ ఆపరేటర్‌ను భర్తీ చేశారు. ధరణి పేరుతో అవినీతికి పాల్పడే వారిని క్షమించేది లేదని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

## కటిక బాలాజీ కుటుంబానికి ఆర్థిక సాయం

**వీపనగండ్ల, ఆగస్టు 29 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కల్వారాల గ్రామానికి చెందిన కటికే బాలాజీ ఇటీవల కాలంలో బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతూ గత కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మరణించిన విషయం తెలిసిన వెంటనే కల్వరాల గ్రామానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ సరిత రవీందర్‌రెడ్డ కటిక బాలాజీ కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయం అందజేస్తూ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి మండల అధ్యక్షులు, బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు



రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిన బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 29 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కాంగ్రెస్ తాలూకా కో ఆర్డినేటర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్దకల్ మండల బిజెపి అధ్యక్షుడు అల్వాల్ రాజశేఖర్‌రెడ్డి, గద్వాల మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పెద్దొడ్డి సర్పంచ్ సునిత, పెద్దపల్లి శివప్ప, రేపల్లె ఎంపిటిసి శివారెడ్డి, మాజీ ఎంపిపి గోవిందు, సవరమ్మ, నీలహళ్లి ఎంపిటిసి శివారెడ్డి,పాతపాలెంఆనంద్‌గౌడ్,గోనుపాడు శ్రీనివాస్‌గౌడ్, డికె గోవిందు, సింగారం పెద్ద ఆంజనేయులు, జెకె ఆంజనేయులు, బొట్ట ఆంజనేయులు, తాటికుంట రవిప్రకాష్‌రెడ్డి,పవనంపల్లి ఉపసర్పంచ్ రాజేశ్వరి, రామాంజనేయులు చేరారు.

## చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం



ఎల్‌ఓసి కాపీలని అందజేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ బస్వరాజ్‌గౌడ్

**భూత్పూర్,ఆగస్టు29 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ ఆరో వార్డుకు చెందిన బొడ్డు అనిత అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ. లక్షా 50 వేల ఎల్‌ఓసి కాపీని మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ బాధితురాలి బంధువు బొడ్డు పెద్ద చెన్నయ్యకు అమిస్తాపూర్‌లో అందించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రామకృష్ణ, ముడా డైరెక్టర్ మూసపాయిలు, బిఆర్‌ఎస్ అమిస్తాపూర్ పట్టణ అధ్యక్షుడు మూస బాలస్వామి, ఆరో వార్డు అధ్యక్షుడు శివరాజ్, నాయకులు రాము, సురేష్, రాజారెడ్డి,సత్తూరురాకేష్‌గౌడ్,సత్తూరు తిరుపతయ్యగౌడ్, పవన్‌కుమార్, శ్రీశైలం, బండారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ◆ వనపర్తి అదనపు కలెక్టర్ యస్.తిరుపతి రావు



**వనపర్తి ప్రతినిధి,ఆగస్టు29 ప్రభాతవార్త:** జిల్లా గ్రామ పంచాయితీలో ప్రతిరోజు ఇంటింటి నుండి చెత్త సేకరణ చేసి వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచు కోవాలని, అదనపు కలెక్టర్ యస్.తిరుపతిరావు సూచించారు. జూనియర్ పంచాయితీ సెక్రెటరీలను క్రమబద్ధీకరించడంలో భాగంగా మంగళవారం పడమటి తాండా,వెంకటాపూర్,కాసింనగర్, అప్పాయిపల్లి, నాగమ్మ తండా గ్రామాలను సందర్శించి పంచాయితీ సెక్రెటరీల పని తీరును పరిశీలించారు.గ్రామపంచాయితీ టాక్స్ వసూలు, జనన మరణాలు రికార్డులు, గ్రీన్ బడ్జెట్, హరితహారం పారిశుద్ధ్యం, పనులను పరిశీలించారు.అదే విధంగా వైకుంఠధామంలో కల్పించిన ఏర్పాట్లు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్‌లను తనిఖీ చేశారు. డిపిఓ సురేష్, సర్పంచులు, ఎంపిడిఓలు,ఎంపిఓలు తదితరులు అదనపు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### ◆జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

**వనపర్తిప్రతినిధి, ఆగస్టు29 ప్రభాతవార్త:** విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా చలో మైదాన్ అవగాహన కార్యక్రమాన్నిస్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన జిల్లా పరిషత్ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు,యువకులు ప్రతిరోజు కనీసం అరగంటసేపు వారికి నచ్చిన ఆటలు ఆడాల్సిన వ్యాయామం చేయాలని కోరారు.మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వాకిటి శ్రీధర్, డిఐఇఓ జాకీర్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, పిడిలు, పిఇటిలు మరియు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఉపాధ్యాయుల కొరత!

**ఉట్కూర్,ఆగస్టు 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దపొర్ల గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అదేవిధంగా స్కూల్ ఛైర్మన్ బుర్ర బాలప్ప,గ్రామ సర్పంచ్ రవికుమార్, గ్రామ ఎంపిటిసి పాతపల్లి శివప్ప,గ్రామ ఉపసర్పంచ్ సమక్షంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారుమాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 250 మంది విద్యార్థులు ఉన్నారని ఉపాధ్యాయులు కేవలం ముగ్గురితో సరి చేయడం విద్యార్థులకుఅన్యాయం చేసినట్లుగానే అన్ని త్వరగా పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని లేని సమక్షంలో పాఠశాలకు తాళంవేసి ధర్నాను చేపడతామని గ్రామ ప్రజలు తెలియజేశారు.

## ఘనంగా పోచమ్మ పండుగ





**చిన్నంబావి, ఆగస్టు29, ప్రభాతవార్త:** మండలపరిధిలోని దగడపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ పండుగ నిర్వహించారు. ఊరే గింపుగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పోచమ్మకు బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే పెద్ద దగడ గ్రామంలో గ్రామ దేవత అయిన సమరమ్మ పండుగను సైతం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో అమ్మవారికి మేకలు, కోళ్ళు, కొబ్బరికాయలతో భక్తు లు సవరమ్మ పండుగను డప్పులు, మేళ తాళాలతో మొక్కులు చెల్లించి పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు నివారించాలి

**- మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** మత్తు పదార్థాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ మోహనరావు అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో మత్తు పదార్థాల నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల యువత పాడైపోవడమే కాకుండా కుటుంబాలు సైతం ఎన్నో ఇబ్బందులకు గురవుతాయని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి, మత్తు వంటివి రవాణా, సరఫరా వంటివి కూడా నూటికి నూరుశాతం అరికట్టాలని తెలిపారు. ఇందుకుగానూ అన్ని శాఖలు సమన్వయంతో గాంజాతో పాటు మత్తు పదార్థాలను అరికట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. గాంజా ఏ రూపంలో ఉన్నా ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, జెడ్పీ సీఈవో జ్యోతి, డీఎస్పీమహేశ్, డీసీబీ డీఎస్పీజివి రమణా రెడ్డి, డిప్యూటీ ఎస్పీఅవినాష్, జిల్లాఇంటర్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బిఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరుగా నమోదు చేయాలి

**● నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్**



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మక్తల్ తహసిల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు నమోదు ప్రక్రియపై తహసిల్దార్‌తో చర్చించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ వారితో మాట్లాడుతూ 18సంవ్సరాలు పైబడిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసి ఓటరు జాబితా పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రకారంగా మార్పులు, చేర్పులు, నమోదు ప్రక్రియను నిర్వహించి ఓటరు జాబితాను సరి చేయాలన్నారు. ఎవరైనా ఓటరు మరణిస్తే వారి డెత్ సర్టిఫికెట్ తీసుకుని ఓటరు జాబితా నుండి తొలగించాలని ఆదేశించారు. అలాగే డబుల్ ఓటర్లు లేరని సంతకం చేసి సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

## కేర్ యాప్ ద్వారా రెండు ఫోన్ల రికవరీ



ఫోన్ రికవరీ చేసి అందజేస్తున్న దృశ్య

**మూసాపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మంగళవారం జరిగే కూరగాయల మార్కెట్‌లో జానంపేటకు గ్రామానికి చెందిన వడ్ల నరేష్, మొబైల్ ఫోన్ మే నెలలో పోయిందని నిజలాపూర్ గ్రామానికి చెందిన చింతకాయల రాజు అనే వ్యక్తి జూన్ నెలలో దొంగతనం జరిగిందని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికపోలీస్ స్టేషన్ ఎస్సై కె. శ్రీనివాసులు కేర్ యాప్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో, మార్కెట్లో బజార్లలో అందరూ జాగ్రత్తగా ఉండాలని గ్రామాలలో చిరు వ్యాపారులు చేయడానికి వచ్చి దొంగతనాలు చేయడానికి అవకాశాలు ఉన్నాయని అందరు గ్రామాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే ఎవరైనా అపరిచితులు గ్రామాల్లోకి వచ్చినట్లయితే సిసి కెమెరా ద్వారా గుర్తించవచ్చు. అనూనితులుగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఫోన్ బాధితులు ఉన్నారు.

## ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయి బ్రాహ్మణులు

**మక్తల్, ఆగస్టు29 ప్రభాతవార్త:** నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు అశ్విని అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు విలేఖులతో మాట్లాడుతూనారాయణపేట జిల్లాలో నూతనంగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమిటి ఎన్నుకోవడం జరిగిందని ఎమ్మెల్యే స్పందిoచి బిసి బంధులోతమకు అవకాశం కల్పించి తమను గుర్తించి సరైన గుర్తింపు ఇవ్వాలని అదేవిధంగా గృహలక్ష్మి పథకంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికి అవకాశం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇతర మండలాల, గ్రామ నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేటి నుంచి నరసింహస్వామి శతమాన ఉత్సవాలు



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు29 ప్రభాతవార్త:** నారాయణపేట పళ్ల రాఘ వేంద్రస్వామి ఆలయంలో కొలువుదీరిన షోడశబాబు లక్ష్మీనరసింహస్వామి శతమాన ఉత్సవాలు బుధవారం నుంచి వచ్చేనెల5వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు తెలిపారు. ఈ ఉత్స వాల్లో భాగంగా స్వామి వారికి అనునిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి పండితుల ఆధ్యాత్మిక ప్రవచనాలు భజన సంకీర్తనలు, హెమాలే తదితర ప్రత్యేక కార్య క్రమాలు అనునిత్యం నిర్వహిస్తారు. మొదటి రోజన అనంత సేవ స్వామి దేవాలయం నుంచి పూర్ణకుంభంతో పురవీధుల గుండా రాఘవేంద్రస్వామి ఆలయం వరకు ర్యాలీ కొనసాగుతుంది. ధ్వజారోహణ గోపూజ అనంతరం గురురాఘవేంద్రస్వామి వారి సాహిత్య ప్రాజెక్టు సౌజన్యంతో కర్ణాటక కంబలూరుకు చెందిన విద్వాన్ శ్రీవత్స వారి భక్త సుధామాపై ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారు. సామూహిక సత్యనారాయణ వ్రతం, భజన, పల్లకిసేవ తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయి.

## మన్యం కొండలో ప్రారంభమైన వీరభద్రస్వామి అఖండదీపారాధన

**- అలంకరణలో దర్శనమిచ్చిన వీరభద్రస్వామి స్వామివారు**
**- కొనసాగుతున్న శాంతిహోమం**
**- ముగిసిన అఖండ విష్ణు సహస్రపారాయణ పఠన పూజా**

**దేవరకద్ర, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీ వీరభద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం రాత్రి అఖండదీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాది శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి క్షేత్రపాలకుడైన శ్రీ వీరభద్రస్వామి వారి అఖండదీపారాధన పూజకార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో బాగంగానే ఈ ఏగాది కూడ స్వామి వారా అఖండదీపారాధన పూజ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ప్రారంభించారు. దాదాపు 41రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని దేవస్థానంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిగ్రహాన్ని రకరకాల పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రాయకృష్ణ, ఈఓ ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పర్య వేక్షకుడు నిత్యానందచారి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామివారికి హారతి ఇస్తున్న దేవస్థానం ఛైర్మన్

**ముగిసిన అఖండ విష్ణు సహస్రపారాయణ పఠన పూజ:** మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో సోమవారం అఖండ విష్ణు సహస్ర పారాయణ పఠన పూజా కార్యక్రమం ముగిసింది. ప్రతి ఏడాది దేవస్థానంలో అఖండ విష్ణు సహస్రపారాయణ పఠన పూజా కార్యక్రమాన్ని 24 గంటలపాటు పఠించడం ఆనవాయితీ వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఆ కార్యక్రమాన్ని ప్రత్యేక పూజల అనంతరం సా ప్రదాయరీతిలో నిర్వహించారు. దేవాలయంలోని శ్రీహనుమద్దాసుల మంటపంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో అర్చకులు, వేదపండితులు పారాయణాన్ని పఠించనున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మెన్ అళహరి మధు సూధన్‌కుమార్, అళహరి రాయకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజా రులు రాజేశ్, నరసింహ్మయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న శాంతిహోమం:** శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మన్యం కొండ దేవస్థానంలో ప్రారంభమైన శాంతిహోమం కార్యక్రమాన్ని పురోహితులు సాంప్రదాయరీతిలో నిర్వహిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు దేవస్థానంలో ఈ పూజలు నిర్వహించనున్నారు. అలాగే బుధ, గురు, శుక్ర వారాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విశేషమాసాన్ని పురస్కరించుకొని మన్యంకొండకు స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు.

## త్వరలోనే క్రీడా పాలసీ అమలు చేస్తాం

- ●దేశానికి క్రీడలు వన్నె తెస్తాయి..
- ●రాష్ట్రంలో ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణాలు
- ●క్రీడాదినోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29, ప్రభాతవార్త:** క్రీడల ద్వారా దేశానికే ప్రత్యేక గుర్తింపు వస్తుందని, రాష్ట్రంలో త్వరలోనే క్రీడా పాలసీ అమలు చేస్తామని ఎక్సైజ్,. పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించిన క్రీడా దినోత్స వం కార్యక్రమాని మంత్రి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయించిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. త్వరలోనే క్రీడాపాలసీ అమలు చేస్తామన్నారు. క్రీడా కోటాలో రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. క్రీడల్లో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతామన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. విద్యార్థులతో కాసేపు కరాటే ఫైట్లు కసరత్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, జయరామ సంస్థల ఎండీ రామిరెడ్డి, శ్రీనివాస్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, కౌన్సిలర్ రష్మిక, నాయకులు ప్రశాంత్, ప్రభాకర్, రాజేశ్వరరెడ్డి, శివరాజ్, మల్యాద్రి పాల్గొన్నారు.



విద్యార్థులతో సరదాగా కరాటే ఆడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## ఆశలకు వేతనం రూ.18వేలుగా నిర్ణయించాలి

**- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్**



మున్సిపల్ వైస్ చైర్మన్ సారికారామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దీప్లానాయక్, ఆశ కార్యకర్తలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29, ప్రభాతవార్త:** ఆశలకు వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ కార్యకర్తలతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీసం వేతనాలు అమలు చేయడం లేదన్నారు. వేతనాలు పెంచాలని, పారితోషకాలు పెంచాలని కోరారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సబ్ సెంటర్లలో పని చేయాలని చెబుతుండడంతో పనిభారం పెరగిందని కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఏరియర్స్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆశలకు ఆరోగ్య భీమా, ఐదు లక్షల ఇన్సురెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని లేని యెడల వచ్చే నెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ సారికా రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుగుణ, నాయకురాళ్లు సావిత్రి, అమృత, శివలీల, జయలక్ష్మి, పద్మ, కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన మహాసభలను జయప్రదం చేయండి

**● గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మనాయక్**

**కొల్లాపూర్, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మహారాష్ట్రలో సెప్టెంబర్ 19,20,21 తేదీలలో గిరిజన సంఘ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కొల్లాపూర్ ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్, జాతీయ నాలుగో మహాసభలు నమ్మక్కల్ మహారాష్ట్రలో సెప్టెంబర్ 19,20,21న జాతీయ మహాసభలు జరగనున్నాయని ఈ మహాసభలను గిరిజన మేధావులు ప్రజా ప్రతినిధులు మహిళలు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మనాయక్ మాట్లాడుతూ దేశంలో ఉన్నటువంటి గిరిజనుల సమస్యలను మూడు రోజులపాటు చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించడం కోసం తమిళనాడులో జాతీయ మహాసభలు జరుగుతున్నాయని ఇప్పటికి అటవి సంరక్షణ నియమాలు 2023 పేరుతో బిజెపి ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం పూర్తిగా గిరిజనులకు వ్యతిరేకంగా ఉన్నదని ఆయన అన్నారు. పర్యావరణం, జీవ వైవిదం ధ్వంసం చేసే విధంగా రూపొందించారని, కంపెనీలకు అప్పజెప్పడం కోసం ప్రభుత్వం పూనుకున్నదని అన్నారు. ఇప్పటికి అడవిలో పశువులను, మేకలను గొర్లను మేపడం కోసం వెళితే ఫారెస్టు అధికారులు దాడులు చేస్తున్నారని వారన్నారు. దేశంలో ఉన్నటువంటి ఉపాధి హామీచట్టం పథకాన్ని 9సంవత్సరాల కాలంలో నీరుగార్చిందని ఎద్దేవా చేశారు. 100 రోజులు పని కల్పించాలని చట్టం చెబితే కనీసం 35 రోజులు కూడా పని కల్పించకపోవడంతో గ్రామాలలో ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో పాటు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వారన్నారు. దేశ జనాభాలో గిరిజనులు 10 శాతం ఉంటే కేవలం 7:50శాతం మాత్రమే అమలు చేస్తూ గిరిజనులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజను డిమాండ్లను తీసుకుని రాబోయే కాలంలో గిరిజన వీరుల పోరాట స్ఫూర్తితో తమ హక్కుల కోసం పోరాటం చేయాలని వారన్నారు. కరపత్రం విడుదల కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సభావత్ అశోక్ నాయక్, సర్పంచ్‌గోపినాయక్, వెంగంపల్లి తండాకేతావత్ శంకర్‌నాయక్, లచ్చిరామ్‌నాయక్, సర్పంచ్ ఎర్రన్న బావితండా, ఉపాధ్యాయ సంఘం నాయకులు కేతవత్ శంకర్ నాయ్, గిరిజన సంఘం మండల అధ్యక్షులు పాత్లవత్ గోవిందునాయక్, వి. గోపాల్ నాయక్, ఎం. దశరథ్ నాయక్ పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

## పేదల పాలిట ఆపన్నహస్తం సీఎం సహాయనిధి

**● అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం**

**అయిజ, ఆగస్టు 29 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పేదల పాలిట ఆపన్న హస్తంగా సీఎం సహాయనిధి ఆదుకుంటుందని ఎమ్మెల్యే అబ్రహాం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులికల్లు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన గ్రామానికి సంబంధించిన మలిదశ ఉద్యమకారుడు దేవన్న కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 3లక్షల రూపాయల చెక్కును నేరుగా వారి ఇంటికి వెళ్లి దేవన్న కుటుంబ సభ్యులకు అందించారు. అంతకు ముందు గ్రామంలో 10 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేదవారి ముఖాల్లో ఆనందం నింపుతున్న ఘనత సీఎం కెసిఆర్ అని ఇప్పటికే పేదవారిని ఆదుకునేందుకై అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఇందులో ప్రధానంగా కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, కెసిఆర్ కిట్, దళితబంధు, బిసి బంధు, వృద్ధాప్య వికలాంగులపెన్షన్స్ పెంచి పేదవారిని ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

## ఆర్. కృష్ణయ్యను కలిసిన బిసి సంఘం నాయకులు

**బిసి కులాల సమస్యలు పరిష్కరించడం కొరకు నిరంతరం పోరాడుదాం**

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు29 ప్రభాతవార్త:** బిసిల సమస్యలు పరిష్కరించాలని బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషికుమార్, మాజీ కౌన్సిలర్ కారంపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. వారిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి మక్తల్ సమస్యలపై క్షుణ్ణంగా చర్చించారు. రాబోయే ఎన్నికల్లో బిసిలను ఏకతాటిపైకి తీసుకువచ్చి చైతన్యపరిచి సమస్యల పరిష్కారం కొరకు బిసిడి నుంచి బిసి ఎలకు చేర్చడం కొరకు అనేక పోరాటాలను నిర్వహించాలని అందులో భాగంగానే రాష్ట్ర కమిటి తరపున తప్పకుండా తమరికి మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ముఖ్యంగా అత్యధికంగా ఉన్నటువంటి బిసి జనాభా ప్రాతిపదిక తన రాజ్యాధికారం కొరకు నిరంతరం కృషి చేస్తామని గ్రామ స్థాయిలో ఉండే ప్రతి ఒక్కరిని చైతన్యవంతం చేయాలని మరీ ముఖ్యంగా విద్య, వైద్య సదుపాయాల్లో అందరికి అందేవిధంగా ప్రోత్సహించాలని అన్నారు. వారిని సన్మానించిన వారిలో వాకిటి శ్రీనివాస్, బిసి సంఘం నారాయణపేట అధ్యక్షుడు సేలేటి వెంకటేష్ పాల్గొన్నారు.



ఆర్. కృష్ణయ్యను సన్మానిస్తున్న దృశ్యం

## ఆశీర్వదించమ్మా..

**- బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు29, ప్రభాతవార్త:** జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లో నిర్వహించిన బోనాల ఉతత్స వాల్లో టీపీసీసీ ప్రధాన కారదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈమేరకు మంగళవారం రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో నిర్వహించిన మైసమ్మ బోనాల ఉత్స వాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగాజడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బూరెడ్డిపల్లిలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మ వారికి పూజలు నిర్వహించారు. ప్రజలకు అండగా ఉంటాను, పోచమ్మ తల్లి ఆశ్వీదించమ్మా అంటూ వేడుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించారు.

## ఘనంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి



**మక్తల్, ఆగస్టు29 ప్రభాతవార్త:** ఆగస్టు29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైక్లింగ్, షూటింగ్‌బాల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ అమర్‌హై, ఆటలు ఆడండి ఆరోగ్యంగా ఉండండి, వందేమాతరం, ధ్యాన్‌చంద్ ఆశయాలను కొనసాగిద్దాం, భారత్ మాతాకీ జైఅంటూ నినాదాలు చేశారు. వందమంది క్రీడాకారులు జాతీయ జెండాలను చేతబూని పురవీధుల గుండా ర్యాలి నిర్వహించారు. అనంతరం ఆయన హాకీ క్రీడలో కనబర్చిన ప్రతిభను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జైపాల్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి, డివిచారి, సత్య ఆంజనేయులు అంజయ్య ఆచారి, తాన్‌సింగ్, పృధ్వి, చంద్రశేఖర్, అంజన్ ప్రసాద్, వెంకటేష్, వి. లక్ష్మణ్ ఆనంద్, రమేష్, దామోదర్, బాలికల హాస్టల్ బాలికలు, నేరడుగాంవిద్యార్థులు, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## శరీరాన్ని మనసును ఏకం చేసేవే ఆటలు

**ఉట్కూర్, ఆగస్టు29 ప్రభాతవార్త:** జాతీయ క్రీడా దినోత్స వాన్ని పురస్కరించుకుని ఎంపియుపిఎస్ నిడుగుర్తి పాఠశాలలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీన్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆటలు శరీరాన్ని, మనసును ఏకం చేసే అద్భుత సాధనం, తద్వారా విద్యార్థులు తమ తరగతికి సంబంధించిన విషయాల్లో కూడా ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయలు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు సునిత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాఖత్, శ్రీనివాస్, ఆంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల అరెస్ట్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 29, ప్రభాతవార్త:** దళితబంధుకు అర్హులైన వారందరికీ దళితబంధు పథకం అమలు చేయాలని కోరుతూ మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసేందుకు వెళ్లిన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొంగలి శ్రీకాంత్‌తోపాటు పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అర్హులైన దళితులందరికీ పథకం అమలు చేయాలని శాంతియుత పద్ధతిలో నిరసన తెలుపతున్న తమకు పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు జగదీశ్, రాజాపూర్, నవాబుపేట మండలాలఅధ్యక్షుడు జీవన్, రాజు బీజేఈ టౌన్ అధ్యక్షుడునాగరాజు, మండలాధ్యక్షుడురమేశ్‌జి, శేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల పండగ వేడుకలు

**లింగాల, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలో మంగళవారం మహిళలు, యువతీ యువకులు బోనమెత్తారు. సర్పంచ్ సౌడమోని పర్వతాలు ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువతులు మహిళలు తలపై బోనాలు పెట్టుకొని పురవీధుల గుండా గ్రామ దేవత బొడ్రాయి వద్దకు చేరుకుని దర్శనం అనంతరం తిరిగి ర్యాలీగా డప్పు వాయిద్యాల మధ్య బోనాలను పోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరారు. ఉత్స వాలలో గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మూసాపేట, ఆగస్టు 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వేముల గ్రామంలో మంగళవారం ఘనంగా బోనాల పండగ వేడుకలు నిర్వహించారు. పోచమ్మ అమ్మవారి బోనాలను పురస్కరించుకుని వేముల గ్రామంలో అమ్మవారికి ఎంతో ఇష్టమైన నైవేద్యం పచ్చిపులుసు అన్నాన్ని తీసుకుని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. డప్పు దరువుతో చిన్న, పెద్ద అందరు కలిసి ఘనంగా పోచమ్మ బోనాల పండగ వేడుకలు నిర్వహించుకున్నారు.

